

# ఆడ నేర్చినా వేటాడ నేర్చినా...!

- డా॥ భానుమతీ రామకృష్ణ

ఆడదీ ఆడదే అన్న చెంచులక్ష్మి (1943 పిక్చరు) పాట కొందరు ఆడవాళ్లను ముఖ్యంగా పురాణాల్లోని ఆడవారిని తల్చుకొన్నప్పుడు నిజమేనేమో అనిపిస్తుంది.

అనాటి నుండి ఈనాటి వరకూ కొందరు ఆడవాళ్ల మనస్థత్వాలను గురించి ఆలోచిస్తే సంకుచిత స్వభావం నీడలా ఆడవాళ్లను వెంటాడుతోందనిపిస్తుంది.

రామాయణంలో కైకేయీ, మందర, సీత, తార, మొదలగు ఆడవాళ్ల మనస్థత్వాలూ, భారతంలో కుంతీ, ద్రౌపదీ, మొదలగు ఆడవాళ్ల మనస్థత్వాలూ విచిత్రంగా కనిపిస్తాయి.

కౌసల్య, సుమిత్ర, ఊర్మిళ పాత్రలు సహనమూ సహృదయమూ గల త్యాగమూర్తులుగా కనిపిస్తాయి.

కైకేయి మొదట రాముడంటే అత్యంత ప్రేమానురాగాలు గల ప్రేమమూర్తిగానూ ఆ తర్వాత కేవలం ఒక పరిచారిక దుర్బుద్ధివల్ల కైకేయి 'సదన్'గా సంకుచిత స్వభావంగల స్వార్థపరురాలుగానూ, దుష్టురాలుగానూ మారినట్లు కనిపిస్తుంది.

తన కుమారుడు భరతుడు రాజ్యం ఏలాలనీ, తన కుమారునికే సింహాసనం కావాలనీ కోరడంలో కేవలం స్వార్థం మాత్రమే కనిపిస్తుంది. కాని శ్రీరాముడిని పధ్నాలుగు సంవత్సరాలు అరణ్య వాసం పంపమని కోరడం కైకేయి యొక్క అమానుషత్వమూ, క్రూరత్వమూ, దుష్టచింతనా, పరాకాష్ట నందుకోవడమే కాక సంకుచిత స్వభావం గల సామాన్య స్త్రీకంటే ఎన్నో రెట్లు కిందికి దిగజారి పోయిందనే చెప్పాలి!

చెప్పుడు మాటలు వినే స్వభావం, తొందరపాటూ, సంకుచిత స్వభావం స్త్రీలలోనే ఎక్కువగా కనిపిస్తుంది!... నేనిలా రాసినందుకు



సాటి ఆడ వాళ్లు నామీద రాళ్లు విసుర్తారని నాకు తెలుసు! కాని నిజాన్ని ఆడదానిగా నేను ఒప్పుకునే రాస్తున్నాను! కొందరు మగవాళ్ల మనస్థత్వం గల ఆడవారూ వున్నారు, ఆడవాళ్ల మనస్థత్వంగల మగవారూ వున్నారు!..... నేనా మొదటి రకం ఆడదాన్ని!...... 'బ్రాడ్ మైండెడ్‌నెస్' (విశాల హృదయం) ఎక్కువగా మగవాళ్లలోనే కనిపిస్తుంది. ఒక మగాడి అందాన్నీ, ఐశ్వర్యాన్నీ ఆధిక్యతనూ చూసి సాటి మగవాడు 'జలసీ' ఫీల్ కావడం అరుదు అది ఆడవారిలో అధికం! ఆడదానికి ఆడదే శత్రువు. అలాంటి వాళ్లను "చుప్పనాతి" శూర్పణఖ అంటూ వుండడం పరిపాటి!...

రామాయణంలోనే అన్ని రకాల స్వభావాలూ గల ఆడవారున్నారు!

ఒకసారి నా మనవరాలు రామాయణం (పిల్లల పుస్తకం) చదువుతూ నన్నొక చిక్కు ప్రశ్న వేసింది! "నానమ్మా సుగ్రీవుడు, వాలీ, కోతులుగదా మరి సుగ్రీవుడి భార్య తార చాలా అందమైందని రాశారే మరి తార ఆడ కోతా! లేక ఆడమనిషా! అందమైన కోతా! లేక అందమైన ఆడదా!"

బాబోయ్ నాకు పెద్ద చిక్కే తెచ్చి పెట్టింది. నాకూ దానికొచ్చిన సందేహమే కలిగింది! ఈ విషయం ఎన్నడూ అట్టే బుర్రకి తట్టలేదే! ఏం చెప్పాలో ఆలోచిస్తుంటే మరో చిక్కు ప్రశ్న వేసింది!

"నానమ్మా మరి లంకలో రావణాసురుడు, అతని తమ్ముడూ, కొడుకూ, అందరూ రాక్షసులు గదా! అంటే వాళ్ల భార్యలూ రాక్షసులేగదా! మండోదరీ, సులోచనా వాళ్లకీ శూర్పణఖ లాగా నోటికి రెండు వేపులా పెద్ద కోరలుంటాయా!"

"వాళ్లకి కోరలు లేకపోవచ్చు వాళ్లంతా ద్రావిడులమ్మా...! మరీ అనాకురాలుగా వుండే వాళ్ళను రాక్షసులన్నారు అంతే" అంటూ తప్పించుకోబోయాను! కాని అది వదల్లేదు!

"ఇంకోటి చెప్పు నానమ్మా! సీత మంచిదంటారు గదా! మరి రాముడిని బంగారు లేడి

కావాలని అడుగుతుందే మేం చిన్న పిల్లలం బొమ్మలు కావాలని అడిగి నట్లు! ఆ తర్వాత రాముడు లేడి కోసం పరుగెడితే ఆ లేడి రాక్షసుడై చచ్చిపోతూ 'లక్ష్మణా' అని అరుస్తాడే రాముడి గొంతుతో, మన సినిమాల్లో డబ్బింగ్ 'వాయిస్' లాగా. అది విన్న సీత లక్ష్మణుణ్ణి రాముడిని రక్షించమని తొందరపెడుతుందే అప్పుడు లక్ష్మణుడు అన్న రాముడి ఆజ్ఞ మీర కూడదని సీతను భద్రంగా కాపాడాలని పోకపోతే లక్ష్మణుణ్ణి చెడ్డమాటలం టుంది. అక్కడ సీతంటే నాకు కోపంగా వుంది నానమ్మా! అక్కడ సీత మామూలు ఆడదానిలాగా నేరోమైండెడ్ వుమన్‌లా అవలేదూ'' అన్నది.



ఏం చెప్పను! దాని పాయింటాఫ్‌వ్యూ కరెక్టేమో అనిపించింది! అంతటితో ఆగలేదు.

"మరొకటి గూడా నాకు నచ్చలేదు నానమ్మా రాముడంతటి మంచివాడు చెట్టు చాటు నుండి వాలి మీద బాణాలేయడం నాకు నచ్చలేదు. రాముడి మీద కోపం, పాపం వాలి మీద జాలీ వేసింది. సీతను తీసుకురావడానికి సుగ్రీవుడు మేలు చేస్తాడనే స్వార్థంతో దొంగచాటుగా వాలిని చంపడం అన్యాయం. అక్కడ, రాముడి కేరక్టర్ చాలా 'డౌన్' అయింది నానమ్మా. రాముడు వెన్నెముక లేని మగవాడిలా పిరికి వాడిగా అయిపోయాడు. ఆ ఎపిసోడ్‌లు నాకు నచ్చలేదు'' అని అంటూంటే ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ దాన్ని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నా!


"ఈ కాలం పిల్లలకు సమాధానం చెప్పడం కష్టమండీ ఇదుగో మా అమ్మాయి కాన్వెంట్‌లో చదువుతున్నదే గదా! అది మన పురాణాల్ని దులిపి పారేస్తుందండీ'' అంటూ నా మనవరాలి స్నేహితు రాలి తల్లి కూతుర్ని వెంట పెట్టుకుని లోపలి కొచ్చింది! స్నేహితురాల్ని చూడగానే నా మనవరాలూ ఒక్క గంతేసి ఆడుకోడానికి తోట్లోకి వెళ్లి పోయింది!

"మీ అమ్మాయి ఏం దులుపు తోంది పురాణాల్లో!'' అన్నాను ఉత్సా హంతో.

"అదేనండీ మీ కృష్ణుడు ఏం చేశాడు ప్రజలకి! ఏసుక్రీస్తు మానవ కోటి కోసం ఎన్ని కష్టాలు పడ్డాడు! రాముడు, కృష్ణుడు, వీళ్ళంతా దేవుళ్ళే కాదు! ఆనాడు ఏసు క్రీస్తూ ఈనాడు మనకి గాంధీ తాతా దేవుళ్లు అంతే'' అంటుంది.

"నిజమే గాంధీ దేవుడే మరో యభయ్యో వందో సంవత్సరాల్లో ఏసుక్రీస్తులా పూజింపబడ తాడు. గుళ్లు గోపురాలూ ఆయనకు కట్టి రామాయణ, భారతాల్లో కథల్లా ఆయన జీవిత కథలు శాశ్వతంగా వుండబోతాయి! మీ అమ్మాయి మంచి తెలివైందీ, చురుకైందీగా కనిపిస్తోంది'' అన్నాను.

"అమ్మో దాని ఆర్గ్యుమెంట్స్‌కి ఎవరూ సమా ధానం చెప్పలేరండీ. భారతంలో ద్రౌపదిని పతివ్రత అనకూడదట. కుంతిని చెడతిట్టేస్తుంది. ఏం చెప్పమంటారు పురాణాల్లో ఆడవాళ్ళంతా మామూలు ఆడవాళ్లకంటే గూడా చాలా 'నేరోమైండెడ్ వుమెన్ అండ్ సెల్ఫిష్ వుమెన్' ముఖ్యంగా కుంతి దొంగ చాటుగా కన్న కొడుకు కర్ణుణ్ణి కొడుకని చెప్పకుండా చివరిదాకా దాచడం ఎంతో అసహ్యంగా వుందిట. అంత టితో ఆగక కురుక్షేత్రం ముందు దొంగతనంగా మొదటి కొడుకు కర్ణుణ్ణి కలుసుకుని దొంగ ఏడుపు ఏడ్చి నువ్వెట్లన్నాపో అర్జునుణ్ణి ఏం చెయ్యద్దని అడుగుతుందే ఆ కుంతీ ఒక తల్లేనా! నాకు ఒళ్లు మంట ఆ కుంతంటే అని లెక్చెరిస్తుందండీ మా పాప'' అని ఆవిడ చెప్పుంటే ఈ కాలం పిల్లలకి ఎంత విచక్షణా జ్ఞానం వుందో ఆలోచిస్తే ఆశ్చర్యం కలిగింది.



"మన పురాణాలు కట్టు కథలం టుందండీ! పురాణాల్లో వున్న అలాంటి ఆడవాళ్లని అసహ్యించుకుంటే సమాజం అధః పాతాళానికి పోతుందనే భయంతో వాళ్లని ఆకాశానికి ఎత్తేసి పతివ్రతలనీ, ఉత్తమ స్త్రీలనీ టైటిల్స్ ఇచ్చారు. అలాంటి స్త్రీల భర్తల పరువు నిలుపుకోవాలంటే మరి వాళ్లకి పవిత్రత అంటగట్టాల్సిందేగా!'' అంటూ తెగ ఆర్గ్యూ చేస్తుందండీ! ఏం చెప్పమంటారు'' అని ఆవిడ అంటూంటే మన పురాణాలను గురించిన వ్యాఖ్యానం ఈ కాలం పిల్లల చేత రాయిస్తే బాగుంటుందేమో అనిపించింది. నమ్మ లేనివీ, నమ్మించినవీ, అన్నీ కుండబద్దలు కొట్టినట్లు రాయగల శక్తి ఈతరం వాళ్లకే వుందేమో అనిపించింది.

"అయితే మగాళ్లంతా గొప్పవాళ్లం టుందా''

"అహ అది ఒప్పుకోదు. రామా యణంలో వాలి, భారతంలో కర్ణుడు గొప్పవాళ్లంటుంది. కృష్ణుడిని చెడ తిడుతుంది. సినిమా 'విలన్' అం టుంది. రామాయణంలో రాముడు వాలిని, దొంగచాటుగా చంపినట్లు భారతంలో కృష్ణుడు అన్యాయంగా కర్ణుణ్ణి అర్జునుడి చేత చంపిస్తాడు. అసలు పాండవులు చవటలంటుంది. అబ్బో ఇలా చెప్పుకుపోతే దాంతో మాట్లాడలేమండి బాబోయ్! అది చెప్పేవన్నీ వింటూంటే ఒక్కోసారి మనం కూడా ఒప్పుకోవాల్సి వస్తోంది. ఏమంటారు'' అని ఆవిడంటూంటే 'అంతే అంటాను' అన్నాను బుర్ర గిర్రున తిరిగిన నేను! ❑